క్లుప్తంగా

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత



నెల్లూరు(దర్గామిట్ట): ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలకు ఉదారంగా ఆర్థిక సాయం మంజూరు చేసి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధితులకు అండగా నిలుస్తున్నారని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గానికి చెందిన 25 మంది లబ్ధిదారులకు రూ.40.70 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలిసి మంత్రి కాకాణి నగరంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వర్తించని వ్యాధులకు వైద్యం చేయించుకున్న బాధితులు అప్పులపాలై ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందజేస్తున్నారని తెలిపారు. పేదలకు ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని వర్గాల వారికి అండగా నిలుస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

కాకాణిని ఆశీర్వదించండి



మనుబోలు: కష్టకాలంలో ప్రజలకు అండగా నిలిచిన సర్వేపల్లి ఎమ్మెల్యే, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. మంగళవారం వారు కాకాణి కోసం మేము సిద్ధం అంటూ మనుబోలులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సర్వేపల్లి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ జరగని విధంగా అభివృద్ధిని ఈ ఐదేళ్లలో చేసి చూపించిన ఘనత మంత్రి కాకాణిదేన్నారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్ష పార్టీ నాయకులు చెప్పే కల్లి బొల్లి మాటలకు, హామీలకు మోసపోవద్దని సూచించారు. నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అనమాల ప్రభాకర్‌రెడ్డి, కేవీఆర్‌గౌడ్, దాసరి మహేంద్ర వర్మ, పార్థు తదితరులున్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని బెజవాడ బుజ్జమ్మ జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు క్రియ స్వచ్ఛంద సంస్థ మంగళవారం ప్రశంసాపత్రాలు అందజేసింది. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ చూపిన 60 మంది విద్యార్థులకు క్రియ స్వచ్ఛంద సంస్థ ప్రశంసాపత్రాలు అందజేయడం సంతోషంగా ఉందని హెచ్‌ఎం సుజాత తెలిపారు. ఉపాధ్యాయులు సుధీర్‌కుమార్, కనకదుర్గ, వరలక్ష్మి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇందుకూరుపేట: విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా మండలంలోని కొరుటూరు, మైపాడు, నరసాపురం గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం నెలకొంటుందని ఏడీ సునీల్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

దోమపోటుతో తీవ్ర నష్టం



పొదలకూరు : దోమపోటు వల్ల వరి పంటకు తీవ్రనష్టం వాటిల్లుతుందని ఏఓ గీతా కుమారి తెలిపారు. మండలంలోని సూరాయపాళెం, విరువూరు, మహ్మదాపురం గ్రామాల్లో వరి పంటను మంగళవారం ఆమె పరిశీలించారు. వరికి దోమపోటు ఆశించినట్లు గుర్తించి నివారణకు సూచనలు చేశారు. దోమ ఉధృతి తక్కువగా ఉంటే ఎకరాకు 320 మి.లీ బ్లూప్రొఫెజిన్ లేదా 94 మి.లీ. ట్రైఫ్లుమెజోపైరిమ్‌ను పిచికారీ చేయాలని సూచించారు. దోమ ఉధృతి అధికంగా ఉంటే తయోమిథాక్సమ్‌ను ఎకరాకు 40 గ్రాములు పిచికారీ చేయాలని తెలిపారు. నల్లనొక్కు ఆశిస్తే ప్రొపికోనోజోల్‌ను ఎకరాకు 200 మి.లీ లేదా హెక్సకోనాజోల్ 400 మి.లీను పిచికారీ చేయాలని సూచించారు.

సబ్సిడీపై పెసర, మినుము విత్తనాలు

పెసర, మినుము సాగు చేయాలనుకునే రైతులకు రైతుభరోసా కేంద్రాల్లో 50 శాతం సబ్సిడీపై విత్తనాలను అందజేస్తామని ఏఓ తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంక్షేమ పథకాలే సీఎం జగన్‌కు శ్రీరామరక్ష



విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి శ్రీరామరక్షగా నిలుస్తాయని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పున్నూరులో మంగళవారం ఆయన పర్యటించారు. రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమానికి 33 పథకాలను అమలు చేయడమే కాకుండా నేరుగా వారి ఖాతాల్లో నగదు జమ చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. దివంగత సీఎం వైఎస్సార్ మరణాన్ని జీర్ణించుకోలేక ఎంతో మంది ప్రాణాలు విడిచారని తెలిపారు. వారి కుటుంబాలను ఓదార్చే విషయంలో సోనియాగాంధీ ఆంక్షలు పెట్టడంతో జగన్ తిరుగుబాటు చేసి ప్రజల్లోకి వచ్చారని గుర్తుచేశారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని స్థాపించి అధికారంలోకి వచ్చారన్నారు. పార్టీ గుర్తు ఫ్యాన్‌పై జగన్‌మోహన్‌రెడ్డి, విజయమ్మ, తరువాత మూడో వ్యక్తిగా ఉపఎన్నికల్లో తాను గెలుపొందానని తెలిపారు. అప్పట్నుంచి జగన్ వెంటే నడుస్తున్నానన్నారు. రానున్న ఎన్నికలు పేదలు, పెత్తందారులకు మధ్య జరుగుతున్నాయన్నారు. పేదల పక్షాన జగన్ ఉంటే, పెత్తందారుల పక్షాన చంద్రబాబు కూటమి నిలుస్తోందన్నారు. జగన్‌ను ఓడించి అధికారం చెలాయించాలని జనసేన, బీజేపీతో కలిసి బాబు వస్తున్నారన్నారు. ఎంత మంది కలిసి వచ్చిన ప్రజల ఆశీర్వాదంతో జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మధ్యతరగతి కుటుంబాలు జగన్‌ను కోరుకుంటున్నాయన్నారు. గ్రామ స్థాయి నుంచి పరిపాలన ఎలా ఉండాలో జగన్ చూపించారన్నారు. గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువచేశారని తెలిపారు. అన్నదాతల కోసం రైతుభరోసా కేంద్రాలు, ప్రజల ఆరోగ్యం కోసం విలేజ్ హెల్త్‌క్లినిక్‌లను తీసుకొచ్చారని వివరించారు. ఆరోగ్యశ్రీ పరిమితిని సైతం రూ.25 లక్షలకు పెంచారని తెలిపారు. మేదరమెట్ల సిద్ధం సభకు వచ్చిన ప్రజాదరణను చూసి ఓర్వలేక పచ్చ మీడియా గ్రాఫిక్స్ పేరుతో ప్రజలను మభ్య పెట్టాలని చూస్తున్నాయన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా తాను లక్షకు పైగా ఇళ్లు తిరిగానని తెలిపారు. అన్ని పార్టీలకు సంబంధించిన వారి ఇళ్లకు వెళ్లానని, అందరూ సంక్షేమ పథకాల లబ్ధి పొంది ఉన్నారన్నారు. వారి మనస్సాక్షి ఒప్పుకోదని అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, జొన్నవాడ ఆలయ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఎంపీడీఓ సాయిలహరి, పార్టీ నాయకులు ఉడతా వెంకటశేషయ్య, గొల్లపల్లి అవినాష్, ఎంపీటీసీ బాలబొమ్మ కరుణాకర్, చిట్టిబోయిన కృష్ణప్రసాద్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ ద్వారా సురక్షిత నీరు



మంచినీటి పథకాన్ని ప్రారంభించి మహిళకు తాగునీరు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

- ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: ఇనమడుగులోని ఇంటింటికి సురక్షిత నీరు అందించాలనే ఉద్దేశంతో జలజీవన్ మిషన్ ద్వారా మంచినీటి పథకం నిర్మించామని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. ఇనమడుగులో జలజీవన్ మిషన్ నిధులు రూ.79.41 లక్షలతో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్, ఇంటింటికీ కుళాయి కనెక్షన్లను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మహిళలకు నీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకు ప్రభుత్వ సేవలను తీసుకొచ్చి చరిత్ర సృష్టించారన్నారు. అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా, ఆ స్థలాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి అందజేశారని తెలిపారు. గ్రామాల్లో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ప్రతి హామీని నెరవేర్చిన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. ప్రజలు కూడా ప్రభుత్వం చేసే మంచిని పూర్తిగా అర్థం చేసుకుంటున్నారన్నారు. అనంతరం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, ఎంపీపీ పార్వతి, వైస్‌ఎంపీపీ నరసింహులురెడ్డి, ఎంఏఏబీ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, డీఎల్డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, సర్పంచ్ ప్రమీలమ్మ, ఎంపీటీసీలు కళ్యాణి, విజయసేనారెడ్డి, , ఏఈలు పరమేశ్వరలింగం, జగదీష్, మాధవయ్య, రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగునకు సహకరించాలి



చెత్త బుట్టలను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ రాజ్యలక్ష్మి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీలకు మంజూరైన చెత్త బుట్టలను మంగళవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించి ప్రతి ఇంటికి రెండు చెత్త బుట్టలు అందజేస్తున్నట్లు తెలిపారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేసి పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో పేదలకు భరోసా



ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజ్యలక్ష్మి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని ఎంపీడీఓ రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని రేబాల–1 సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఎంపీడీఓ శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేస్తోందని వివరించారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేయిస్తోందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సీహెచ్ సతీష్‌రెడ్డి, సర్పంచ్ భాగ్యలక్ష్మి, నాయకులు నాగసుబ్బారెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ నిధులతో మరో పది ఆలయాల నిర్మాణం

పొదలకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలో మరో పది ఆలయాల నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం ముందుకొచ్చింది. ఇప్పటికే సర్వేపల్లి నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 78 దేవాలయాల నిర్మాణానికి టీటీడీ శ్రీవాణి ట్రస్టు ద్వారా ఒక్కో ఆలయానికి రూ.10లక్షల వంతున నిధులు మంజూరు చేసింది. అందులో చాలా వరకు ఆలయాలు నిర్మాణంతో పాటు విగ్రహ ప్రతిష్ఠను పూర్తి చేసుకున్నాయి. నియోజకవర్గంలో వంద ఆలయాలను నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కొత్తగా మరో పది ఆలయాల నిర్మాణానికి టీటీడీ ద్వారా నిధులు మంజూరు చేయించారు. అందులో పొదలకూరు మండలంలో 9, వెంకటాచలం మండలంలో ఒక దేవాలయం నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు దేవదాయశాఖ కమిషనర్ తెలిపారు. పొదలకూరు మండలం నల్లపాళెం పంచాయతీ పరిధిలోని మిక్స్‌డ్ కాలనీ, గురువాలయపాళెం, గురువాలయపాళెం మిక్స్‌డ్ కాలనీ, తాటిపర్తి మిక్స్‌డ్ కాలనీలో రామాలయాలు, తోడేరు వీవర్స్‌కాలనీలో విఘ్నేశ్వరాలయం, తాటిపర్తి ఎస్సీ కాలనీలో అంకమ్మతల్లి ఆలయం, తోడేరు ఎస్సీ కాలనీలో మాతా పరమేశ్వరి ఆలయం, విరువూరు ఎస్సీ కాలనీలో మాతమ్మ ఆలయం, పొదలకూరు మిక్స్‌డ్ కాలనీలో మానసాదేవి సమేత నాగలక్ష్మి ఆలయం, వెంకటాచలం మండలం సర్వేపల్లి బీసీ కాలనీలో గంగమ్మ ఆలయ నిర్మాణానికి అనుమతులు లభించాయి. ఈ సందర్భంగా నల్లపాళెం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు పార్లపల్లి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ రామాలయ నిర్మాణానికి ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న నల్లపాళెం మిక్స్‌డ్ కాలనీవాసుల కల నెరవేరిందని, అందుకు కృషి చేసిన మంత్రి కాకాణికి కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే వైఎస్సార్‌సీపీ అజెండా

- కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి
- ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



కోవూరు: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్‌సీపీ అజెండా అని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఇనమడుగు గ్రామ సచివాలయ ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. భారీ కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ 13 ఏళ్లు పూర్తి చేసుకుని 14వ వసంతంలోకి అడుగుపెట్టిందన్నారు. ఈ 13 ఏళ్లలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొని పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టాక అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రజారంజక పాలన సాగిస్తున్నారని కొనియాడారు. జగన్‌ను ఎదుర్కోలేక రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలన్నీ ఏకమై వస్తున్నాయన్నారు. జగన్ మాత్రం సింగిల్‌గా సింహంలా వస్తారన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రజాశీర్వాదంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. డీఏఏబీ చైర్మన్ నిరంజన్ బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి, నాగార్జున కన్‌స్ట్రక్షన్ అధినేత వసంతకుమార్‌రెడ్డి, ఎంపీపీ టీ పార్వతి, వైస్‌ఎంపీపీ నరసింహులురెడ్డి, ఎంఏఏబీ చైర్మన్ హరిప్రసాసాద్‌రెడ్డి, డీఎల్డీఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి. పడుగుపాడు సొసైటీ చైర్మన్ మల్లికార్జున్‌రెడ్డి, సర్పంచ్ ప్రమీలమ్మ, ఎంపీటీసీలు కళ్యాణి, విజయసేనారెడ్డి, నాయకులు చిరంజీవి, అంజన్‌రావు, సాయియశ్వంత్‌రెడ్డి, జగదీష్, శేఖర్‌స్వామి, నాగార్జున, వెంకటేశ్వర్లు. విజయ్‌కుమార్, నందగోపాల్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలం: పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పంచుకుంటున్న నాయకులు

వెంకటాచలం: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే రాబోయే ఎన్నికల్లో ఆయనకు శ్రీరామ రక్షగా నిలుస్తాయని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంకటాచలంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటశేషయ్య మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను మన రాష్ట్రంలో అమలు చేస్తూ పేదల హృదయాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని అమలు చేశారని తెలిపారు. చంద్రబాబు రుణమాఫీ పేరుతో రైతులు, పొదుపు మహిళలను మోసం చేశారని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్ రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుండడంతో వైఎస్సార్‌సీపీ బలమైన పార్టీగా మారిందన్నారు. పార్టీ నాయకులు తాటిపర్తి సురేష్, ఉప్పు అశోక్, హరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి కాకాణి పర్యటన

మనుబోలు: మండలంలోని మడమనూరులో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం పర్యటించనున్నట్లు పీఏసీఎస్ అధ్యక్షుడు మారం రెడ్డి ప్రదీప్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మడమనూరులోని చేనేత కుటుంబాలకు మంత్రి కాకాణి మగ్గాలను పంపిణీ చేస్తారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష సామగ్రి అందజేస్తున్న ప్రభాకర్‌రెడ్డి

మనుబోలు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. ఎస్ఎస్సార్ ఫౌండేషన్ చైర్మన్, అక్కంపేట మాజీ సర్పంచ్ నారపరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి దాతృత్వంతో పాఠశాల కోఆప్షన్ మెంబర్ అనమాల ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్ఎస్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ కిరణ్‌కుమార్‌రెడ్డిని కోరిన వెంటనే విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేయడం అభినందనీయమన్నారు. పది ఫలితాల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.10 వేల నగదు ప్రోత్సాహకం అందజేస్తామని ప్రకటించారు. పాఠశాల హెచ్‌ఎం డేవిడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం

- కోవూరు సీడీపీఓ పీ జ్యోతి



కొడవలూరు: పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న కోవూరు సీడీపీఓ జ్యోతి

కొడవలూరు: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేసే పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా గర్భిణులు, చిన్నారులు, బాలింతల్లో రక్తహీనత దూరమవుతుందని కోవూరు సీడీపీఓ పీ జ్యోతి పేర్కొన్నారు. ఆలూరుపాడు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో సీడీపీఓ పాల్గొని పోషకాహారంపై అవగాహన కల్పించారు. తక్కువ ధరకు లభ్యమయ్యే పోషకాలున్న కాయగూరలు, ఆకుకూరలు, గుడ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. గర్భిణులు పోషకాహారం తీసుకోకపోతే రక్తహీనత తలెత్తి కాన్పు కష్టతరమవుతుందని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్ నిర్మల, అంగన్‌వాడీలు సునీత, మంజుల, శీనమ్మ, సుష్మిత పాల్గొన్నారు.

– నార్తురాజుపాళెం సెక్టారు పరిధిలోని బొడ్డువారిపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ టీ నాగభూషణమ్మ, యల్లాయపాళెం సెక్టార్ పరిధిలోని కొత్తవంగల్లు చీకిరేణిగుంట అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ పద్మావతి పోషకాహారంపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీలు పీ మధుసూదనమ్మ, కే ఎస్తేరమ్మ, కే సునీత, ఏ అనూరాధ, ఏ హరిప్రియ, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి

కోవూరు : గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ ఏసీడీపీఓ అరుణ సూచించారు. లేగుంటపాడు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు బయట దొరికే జంక్‌ఫుడ్‌కు బదులుగా ఇంట్లో పోషకాహారాన్ని తయారు చేసి అందించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, పాలు, గుడ్లు, తదితర పోషకాహారాన్ని ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, అంగన్‌వాడీలు సుజాత, మనీషా, అపర్ణ, ఎంఎస్కే సుప్రియ, తదితరులు పాల్గొన్నారు.

ఇందుకూరుపేట: గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. మండలంలోని మైపాడు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తక్కువ ధరకు లభ్యమయ్యే ఎక్కువ పోషక విలువలుండే ఆహారంపై అవగాహన కల్పించారు. 3 నుంచి 5 ఏళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని సూచించారు. అంగనవాడీలు కృష్ణవేణి, మంజుల, సుబ్బలక్ష్మి, వెంకటరమణమ్మ, యుగంధి, రేణుక, సీత పాల్గొన్నారు.



కోవూరు: లేగుంటపాడు అంగన్‌వాడీ కేంద్రంలో..



ఇందుకూరుపేట: మైపాడులో..

కుష్టు సర్వేను బాధ్యతగా నిర్వహించాలి



ఆశాకార్యకర్తలతో మాట్లాడుతున్న వైద్యులు

కోవూరు : కుష్టు సర్వేను ఆశాకార్యకర్తలు బాధ్యతగా నిర్వహించాలని ఇనమడుగు పీహెచ్‌సీ వైద్యులు నిరంజన్, ఇర్ఫాన్ అన్నారు. ఇనమడుగు పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు విధుల్లో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఇంటింటికి వెళ్లి కుష్టు సర్వే చేపట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను నిర్వహించాలని సూచించారు. వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేసీ మాధవన్

కోవూరు : ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధంతో సమానమని, ప్రతిఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోవూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, జేసీ సేతు మాధవన్ కోరారు. సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరోల్ పార్టిస్పేషన్ (స్వీప్) ప్రోగ్రాంలో భాగంగా కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు అవగాహన పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీప్‌లో భాగంగా ఓటర్లను చైతన్యవంతం చేసేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలని కోరారు. ఏఈఆర్వో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం శ్రీనివాసులు, తహసీల్దార్ విజయశ్రీ, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్లు మధుసూదన్‌రావు, రవికుమార్, స్వీప్ నోడల్ అధికారి పీవీ రత్నం, అసిస్టెంట్ స్వీప్ అధికారి రవిశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

ఇందుకూరుపేట: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని విద్యుత్‌శాఖ ఈఈ విజయ్‌కుమార్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. కొత్తూరు విద్యుత్‌శాఖ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వేసవిలో వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్‌ను అందించాలని సూచించారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించేలా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకం కింద 300 యూనిట్లలోపు గృహ విద్యుత్ వినియోగదారులకు సబ్సిడీపై సోలార్ రూఫ్‌టాప్ ప్యానెల్స్‌ను అమర్చుకునే అవకాశాన్ని కల్పిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీ సునీల్‌కుమార్, ఏఈలు రమేష్‌బాబు, నరసింహులు, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.